ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



వనపర్తి

జిల్లా వార్తలు

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 । కనిష్ఠం : 23.0

మంగళవారం 23 సెప్టెంబరు 2025

కలెక్టరేట్ ఎదుట రైతుల ఆత్మహత్యాయత్నం

- ప్రజావాణికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- పురుగుల మందు తాగుతుండగా లాక్కున్న పోలీసులు



గద్వాల కలెక్టరేట్ ఎదుట రైతు చేతిలో నుంచి పురుగుల మందు డబ్బాను లాక్కుంటున్న పోలీసులు

7

కుండపోత వర్షానికి జలమయం



6

బిలోల్ వద్ద కాజ్‌వేపై ఎక్కి పారుతున్న వరదనీరు



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

మాట తప్పిన సీఎం రేవంత్

- కొత్త పింఛన్లు మంజూరయ్యే దాకా పోరాడుతా
- ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి రాడు.. బయట తిరగడు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

7

రిజర్వేషన్లపై.. ఉత్కంఠ



తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామ పంచాయతీ కార్యాలయం

సీల్డ్ కవర్లలో నివేదికను పంపించనున్న కలెక్టర్లు

- నేటితో ప్రాథమిక ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశం
- 50 శాతం మహిళా కోటాను లాటరీ పద్ధతిలో తీసే అవకాశం
- కుల గణనలో వచ్చిన జనాభా ఆధారంగానే రిజర్వేషన్ల ఖరారు
- కలెక్టరేట్లలో అధికారులు బిజీబిజీ.. రోజంతా వీసీలు, సమీక్షల్లోనే



మహబూబ్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం దృష్టి సారించింది. రిజర్వేషన్ల ఖరారు కోసం వివరాలను సీల్డ్ కవర్‌లో మంగళవారం వరకు ప్రభుత్వానికి సమర్పించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. షెడ్యూల్ ప్రకారం 2024 జనవరి, ఫిబ్రవరిలో సర్పంచులకు, జూన్, జూలైలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఎప్పుడో సిద్ధమైంది. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీని నిలబెట్టుకునే దిశలో రాష్ట్ర వ్యాప్తంగా కులగణన సర్వే కూడా నిర్వహించింది. ఇప్పుడు ఆ వివరాలు ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. రిజర్వేషన్ల విషయంలో అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించడం, అది రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండటం, రెండు బిల్లులు గవర్నర్ దగ్గర పెండింగ్‌లో ఉండటంతో కాలయాపన జరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో హైకోర్టు కూడా సెప్టెంబరు 30లోపు ఎన్నికలు నిర్వహించాలని సూచించింది. దానిపై తొలుత సుప్రీంకోర్టుకు వెళ్లి బిల్లులు పెండింగ్‌లో ఉన్న విషయంపై ప్రభుత్వం వాదనలు వినిపిస్తుందని భావించినప్పటికీ.. అనూహ్యంగా రిజర్వేషన్ల కోసం సీల్డ్ కవర్‌లో నివేదిక అందించాలని కలెక్టర్లను ఆదేశించడంతో ప్రక్రియ మొదలైందని చెప్పవచ్చు. సీల్డ్ కవర్లలో అందిన నివేదిక తర్వాత ప్రభుత్వం జీఓ జారీ చేసి, దాని ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేసిన తర్వాత గెజిట్ విడుదల చేసే అవకాశం ఉంది.

కులగణన ఆధారంగానే..

కులగణన ఆధారంగానే బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుత

(మిగతా 6లో..)

చివరి ఆయకట్టుకు చుక్క నీరు రాలే

- మాడ్గుల మండలం నాగిళ్ల వరకు పూర్తి కాని భూసేకరణ
- తరచూ తెగిపోతున్న డీ-82 కాలువ
- చివరి ఆయకట్టు వరకు సాగునీరివ్వాలంటే పీఆర్ఎల్ లింక్ కెనాల్‌పైనే ఆశలు



వట్టెం రిజర్వాయర్

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) కింద క్రమంగా పెరుగుతున్న ఆయకట్టుకు నీరందించే క్రమంలో సాగునీటి శాఖకు అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. కేఎల్ఐ హెడ్‌వర్క్స్‌లో రెండు మోటార్లు మరమ్మతుకు నోచుకోకపోవడం, కాల్వల సామర్థ్యం పెరిగినా ఆయకట్టుకనుగుణంగా పెంచకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. కేఎల్ఐ కింద ఎల్లూరు, సింగవట్నం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్లు మినహాయించి చెరువులు, కుంటల్లో నీళ్లు నింపడం తప్ప అదనంగా నిర్మించాల్సిన 17 రిజర్వాయర్ల ఊసే ఎత్తలేదు. దీంతో కేఎల్ఐపై ఆశలు పెట్టుకున్న చివరి ఆయకట్టు రైతుల్లో నిరాశ వ్యక్తమవుతోంది.

చివరి ఆయకట్టు రైతుల ఆశలు ఆవిరి..

కేఎల్ఐ కింద 2.45లక్షల ఎకరాల మెట్ట పంటలకు సాగునీరందించాలనే లక్ష్యంతో పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో రైతుల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఆయకట్టు పరిమాణం పెరుగుతూ దాదాపు 4.45లక్షల ఎకరాలకు చేరింది. 2.45లక్షల ఎకరాల ఆయ కట్టుకు సాగునీరందించాలనే లక్ష్యంతో కేఎల్ఐ డిజైన్ రూపొందించారు. గుడిపల్లి గట్టు నుంచి 160 కిలోమీటర్ల వరకు మాడ్గుల మండలం నాగిళ్ల వరకు సాగునీరందించాల్సిన మెయిన్ కెనాల్‌లో అసలు ఆయకట్టు 1.80లక్షల ఎకరాలు కాగా.. డీ-82 వరకు అదనంగా 37,742ఎకరాలకు పెంచారు. బుద్దారం కెనాల్ ఆయకట్టు విస్తీర్ణాన్ని 20,724 ఎకరాలకు పెంచగా కేఎల్ఐ మెయిన్ కెనాల్‌లో 37వ కిలో మీటరు వద్ద ఘణపూర్ బ్రాంచ్ కెనాల్ పేరిట మరో 25వేల ఎకరాల ఆయకట్టును జోడించారు. కర్నెతండాలో 4,400 ఎకరాలు, మార్కండేయ రిజర్వాయర్ పేరిట 7,310 ఎకరాల్లో కేఎల్ఐ ఆయకట్టు కింద విస్తీర్ణాన్ని రైతుల డిమాండ్ దృష్ట్యా పెంచాల్సి వచ్చింది. కల్వకుర్తి కెనాల్ కింద రంగారెడ్డి జిల్లాలోని మాడ్గుల, ఆమనగల్ మండలాల్లో దాదాపు 21వేల ఎకరాలకు కృష్ణా జలాలతో మెట్ట భూములను తడపాల్సి ఉండగా కనీసం వెయ్యి ఎకరాలకు కూడా నీరందించలేని పరిస్థితి తలెత్తింది. డీ-82 కెనాల్ తరచూ తెగిపోతుండడంతో చివరి ఆయకట్టుకు చుక్క నీరందించలేని పరిస్థితి తలెత్తింది. అచ్చంపేట బ్రాంచ్ కెనాల్ పరిస్థితి కూడా అలాగే ఉంది. 90వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించాల్సి ఉండగా 15వేల ఎకరాల ఆయకట్టును పెంచడంతో క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

లింక్ కెనాల్‌తోనే సమస్యకు పరిష్కారం

సుదీర్ఘకాలం పాటు సాగునీటి సమస్యలను ఎదుర్కొన్న నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రతీ గ్రామానికి కృష్ణా జలాలు అందాలనే డిమాండ్ ఉంది. ఈ క్రమంలో అధికార ప్రతిపక్షాలు కూడా ప్రతీ గుంటకు సాగునీరందిస్తామని రైతులను నమ్మించారు. మున్ముందు వచ్చే డిమాండ్లకు అనుగుణంగా కేఎల్ఐ రూపొందించకపోవడం కారణంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్)పై రైతులు అనేక ఆశలు పెట్టుకున్నారు. సమస్యలను పరిగణనలోకి తీసుకోకపోవడంతో పీఆర్ఎల్ఐఎస్ ద్వారా లింక్ కెనాల్ ఆవశ్యకత ఏర్పడింది. ఈ క్రమంలో రూ.15కోట్ల వ్యయంతో లింక్ కెనాల్ కేఎల్ఐకి అనుసంధానం చేసేందుకు వట్టెం రిజర్వాయర్ మీదుగా కేఎల్ఐ అదనపు ఆయకట్టుకు లింక్ కెనాల్‌ను నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపా దనలు పంపించారు. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)ను తెప్పించుకున్న అధికారులు త్వరలోనే అనుమతులు వస్తాయనే ఆశావాహ దృక్పథంతో ఉన్నారు. వట్టెం రిజర్వాయర్‌లోని 10.100 కిలో మీటర్ల నుంచి 15.23కిలోమీటర్ల వరకు లింక్ కెనాల్ నిర్మాణం చేపడితే తద్వారా మాడ్గుల మండలం నాగిళ్ల వరకు దాదాపు 1.50లక్షల ఎకరాలకు సాగునీరందించే ప్రక్రియ సులభతర మవుతుందని ప్రతిపాదించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి మౌఖికంగా ఇరిగేషన్ అధికారులకు అనుమతులు లభించిన సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాతనే విషయాన్ని ప్రజాప్రతినిధుల ద్వారా తెలియజేయాలని నిర్ణయానికొచ్చినట్లు తెలిసింది.

ఫిర్యాదులకు పరిష్కారం చూపాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

వనపర్తి రాజీవ్ చౌరస్తా, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యాదయ్య, ఆర్డీవో సుబ్రమణ్యం, డీఆర్‌డీఓ ఉమాదేవితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి, ఫిర్యాదులు, ప్రతీ సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి మొత్తం 28 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, వీసీ ద్వారా మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన శరన్నవరాత్రి వేడుకలు

- శైలపుత్రీదేవి అలంకరణలో జోగుళాంబాదేవి
- తొలిరోజు ధ్వజారోహణ, అంకురార్పణ

అలంపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఐదోశక్తి పీఠమైన అలంపూర్ జోగుళాంబాదేవి ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి రోజు జోగుళాంబ అమ్మవారు శైలపుత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. హిమవంతుడి పుత్రికగా, దుర్గమ్మ తొలి రూపంగా శైలపుత్రీ దేవిని కొలుస్తారు. ఆలయ ఈఓ దీప్తి, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జోగుళాంబాదేవి ఆలయంలో అనతి స్వీకరణ, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, కలశస్థాపన వంటి పూజలు నిర్వహించారు. సాయంత్రం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా భక్తులు తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి మండల దీక్షలు, నవరాత్రుల దీక్షలను స్వీకరించారు. అమ్మవారి ఆలయంలో మహిళలు కుంకుమార్చన, చండీహోమం నిర్వహించారు.



శైలపుత్రీదేవి అలంకరణలో జోగుళాంబ అమ్మవారు

సేంద్రియ వ్యవసాయాన్ని కొనసాగిద్దాం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

6

యూరియా కోసం రైతుల కష్టాలు

- ఉదయం నుంచి సింగిల్ విండో వద్ద ఎదురుచూపులు
- పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ



పెద్దకొత్తపల్లి పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

6



కల్వకుర్తిలో ధాన్యలక్ష్మి అలంకరణలో వాసవీమాత



జడ్చర్ల వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో అర్ధనారీశ్వరీదేవిగా అమ్మవారు



గద్వాలలో పార్వతీ దేవి అలంకరణలో జములమ్మ అమ్మవారు



కొల్లాపూర్ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వెండి కవచంలో దర్శనమిస్తున్న అమ్మవారు



ఉమామహేశ్వరంలో శైలపుత్రి దేవిగా అమ్మవారు



బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో ఆదిలక్ష్మి అలంకరణలో అమ్మవారు

నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

» వివిధ అలంకరణల్లో అమ్మవారి దర్శనం

అచ్చంపేట/ కల్వకుర్తి/ గద్వాల/ జడ్చర్ల/ కొల్లాపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమివ్వగా, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అచ్చంపేటలోని ఉమామహేశ్వర క్షేత్రంలో అమ్మవార్లు శైలపుత్రి దేవిగా మొదటి రోజు దర్శనమిచ్చారు. కల్వకుర్తి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీమాత భక్తులకు ధాన్యలక్ష్మీ అలంకరణలో దర్శనమిచ్చారు. గద్వాల జములమ్మ ఆలయంలో అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. జడ్చర్ల పట్టణంలోని వాసవీకన్యకపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు అర్ధనారీశ్వరీ దేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలుచేశారు. కొల్లాపూర్ పట్టణంలో తొలి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులు దర్శనమిచ్చింది.

మక్తల్ బస్టాండ్‌లో భారీ చోరీ

» 10 తులాల బంగారం, రూ.50వేల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

మక్తల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ ఆర్టీసీ బస్టాండ్ చోరీలకు అడ్డాగా మారింది. ఓ వైపు బస్టాండ్‌లో పోలీసుల తనిఖీ చేపడుతున్నా తరచూ చోరీలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో 10తులాల బంగారు ఆభరణాలు, రూ. 50వేల నగదు ఎత్తుకెళ్లారు. పట్టణంలోని గుర్లపల్లి రోడ్‌లో ఉన్న షైమునాబే గం, తౌజియా బేగం ఇంట్లో నవంబర్‌లో వివాహం జరగనుంది. దీంతో తమ ఇంట్లో ఉన్న పది తులాల బంగారం, రూ.50వేల నగదును నారాయణపేటకు తీసుకెళ్లేందుకు జజియాబేగంతో కలిసి మక్తల్ ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. నగదు, నగలను ఓ చేతి పర్సులో ఉంచుకున్నారు. నారాయణపేట బస్సు ఎక్కిన తర్వాత కొద్ది దూరం వెళ్లాకా చేతిలో ఉన్న పర్సును విప్పి చూడగా అందులో బంగారం, నగదు కనిపించలేదు. దీంతో వెంటనే మక్తల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీని పరిశీలించేందుకు ప్రయత్నించగా ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో దొంగల చిత్రాలు సీసీ పుటేజీల్లో నిక్షిప్తం కాలేదు.

కోల్డ్ స్టోరేజ్‌లో మిర్చి బస్తాలు చోరీ

మానవపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కోల్డ్ స్టోరేజ్‌లో మిర్చి బస్తాలు ఎత్తుకెళ్లిన 8 మందిని పట్టుకున్న ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడులో చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నారాయణపూరం గ్రామశివారులోని వైవైవై కోల్డ్ స్టోరేజ్‌లో శుక్రవారం అర్ధరాత్రి గద్వాల మండలం చెనుగోనిపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్, నందు, రాజేశ్, నరేశ్, మంజునాథ, హనుమంతు, రాజు, మహేశ్ కోల్డ్ స్టోరేజ్ వద్ద ఎవరూ లేని సమయంలో ప్రహరీ గోడ దూకి ప్లాట్‌ఫామ్ మీద ఉన్న 101 మిర్చి బస్తాల్లో 72 బస్తాలను డీసీఎంలో వేసుకుని వెళ్లిపోయారు. ఉదయం స్టోరేజ్ ఇన్‌చార్జి బస్తాలు లేవని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటికప్పుడు హైదరబాద్‌లోని మలక్‌పేట మార్కెట్‌కు సమాచారం ఇచ్చారు. 72 బస్తాల్లో 25 బస్తాలు ముందుగా అమ్ముకునేందుకు రాజు ఆటోలో మార్కెట్‌కు వెళ్లాడు. బస్తాలపై 101 నెంబర్ ఉండటంతో దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీంతో విచారించి మిగతా బస్తాల కోసం రాజును తీసుకెళ్లగా, డీసీఎంలోని బస్తాలను గోల్కొండ గ్రామ శివారులోని వెంచర్ వద్ద వది లేసి వెళ్లారు. పోలీసులు అక్కడికి చేరుకునే లోపు అక్కడ 25 బస్తాలు మాత్ర మే ఉన్నాయన్నారు. ఈ మిర్చి బస్తాలు నారాయణపూరం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ అనే రైతుకు చెందినవి కాగా, ఎల్కూరు గ్రామానికి చెందిన వ్యాపారి తిక్కయ్య కొనుగోలు చేశారని వివరించారు. కోల్డ్ స్టోరేజ్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు.

ఇజ్రాయిల్‌లో ఉద్యోగాల పేరుతో మోసం

» ఒక్కొక్కరి నుంచి రూ. 8 లక్షల వసూలు

» ఉద్యోగాలు ఇప్పించకపోగా, చెల్లని చెక్కులు ఇచ్చిన వైనం

» కలెక్టరేట్ ముందు నిరసన తెలిపిన బాధితులు



చెల్లని చెక్కులను చూపిస్తున్న బాధితులు

గద్వాల క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూరుకు చెందిన ఓ వ్యక్తి కోనసీమ జిల్లాకు చెందిన వారిని మోసం చేశాడు. దీంతో వారు సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సకినేటిపల్లి మండలంలోని అంతర్వేదిలో 2023, నవంబర్ 12న సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికుడు ఒకరు, జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరుకు చెందిన మరనాథ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ కె.సుదర్శన్ అబ్రహాంను వారికి పరిచయం చేశారు. ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని సుదర్శన్ అబ్రహాం వారిని నమ్మించాడు. అందుకోసం ఒక్కొక్కరి నుంచి రూ. 8 లక్షల చొప్పున 42 మంది వద్ద డబ్బు వసూలు చేశాడు. ఆ తర్వాత 2024, జూలై 9న వారిని ఇజ్రాయిల్‌కు పంపించారు. కానీ అక్కడ ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో వారం రోజుల తర్వాత జూలై 16న వారు వెనుదిరిగి వచ్చారు. మరుసటి రోజు వారందరూ ధరూరుకు వచ్చి సదరు పాస్టర్‌ను కలిసి, తమ డబ్బు తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి చేశారు. దీంతో మరుసటి రోజు వారందరికీ వేర్వేరు తేదీలతో చెక్కులు ఇచ్చాడు. దీంతో వారంతా స్వస్థలాలకు వెళ్లిపోయారు. కానీ అతడు ఇచ్చిన చెక్కులేవీ చెల్లలేదు. అప్పటి నుంచి పలుమార్లు బాధితులు ఆ పాస్టర్‌ను ఫోన్లలో సంప్రదిస్తూనే ఉన్నారు. కొందరు స్వయంగా వచ్చి కూడా అతడిని కలిసి డబ్బులడిగారు.

చివరకు ఆ పాస్టర్ ఫోన్ కూడా ఎత్తకపోవడంతో ఈ నెల 13న 15 మంది బాధితులు ధరూరులోని మరనాథ చర్చికి వచ్చారు. కానీ ఆ పాస్టర్ సరైన సమాధానం కూడా ఇవ్వలేదు. దీంతో డబ్బులు ఇచ్చే వరకు ఇక్కడే ఉంటామని చెప్పి, అదే చర్చి పక్కనున్న ఓ హాల్‌లో వంట చేసుకొని తింటూ అక్కడే ఉంటున్నారు. కాగా రెండు రోజుల క్రితం ఆ పాస్టర్ కుటుంబ సభ్యులు 100కు ఫోన్ చేసి, తమ ఇంటిపై కొందరు దౌర్జన్యానికి యత్నిస్తున్నారని చెప్పారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకొని కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ 'ప్రజావాణి' కార్యక్రమంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆందోళనలో బాధితులు గొల్లమేరీ, చిట్టిబాబు, బాలకృష్ణ, కిశోరి, భారతిలతో పాటు మరి కొందరు పాల్గొన్నారు.



బతుకమ్మను ఎత్తిన కలెక్టర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



బతుకమ్మను ఎత్తిన మహిళలు

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ

● పిల్లలమర్రిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



పిల్లలమర్రిలో బతుకమ్మ వేడుకల్లో వెటర్నరీ ఉద్యోగులు



పిల్లలమర్రిలో అలంకరించిన బతుకమ్మ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఆత్మగౌరవ, వారసత్వ సంపద, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీక బతుకమ్మ పండుగ అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని పిల్లలమర్రి పర్యాటక కేంద్రంలో నిర్వహించిన రెండో రోజు అటుకుల బతుకమ్మ సంబురాల్లో కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బతుకమ్మ పండుగ చెడుపైన మంచి సాధించిన విజయానికి సూచిక అన్నారు.

వైద్యారోగ్యశాఖ, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మెడికల్ కళాశాల, పబ్లిక్ హెల్త్, పశు సంవర్ధక శాఖ, రెసిడెన్షియల్ కళాశాలలు, డీఆర్‌డీవో, మునిసిపల్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, ముఖ్య ప్రణాళిక శాఖల మహిళా ఉద్యోగులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని బతుకమ్మలను పెట్టి ఆట పాటలతో సందడి చేశారు.

సేంద్రియ వ్యవసాయాన్ని కొనసాగిద్దాం

» రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి

గద్వాల సర్కిల్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు సేంద్రియ వ్యవసాయాన్ని కొనసాగిద్దామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పేర్కొన్నారు. గద్వాలలోని న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న ఓం శాంతి ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ అమృత్‌కుంజ్ భవన్‌లో కేంద్ర ఇన్‌చార్జి మంజుల బెహన్‌జీ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ ఆర్గానిక్ దినోత్సవానికి చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సేంద్రీయ ఎరువుల వినియోగమే మనిషి ఆరోగ్యాన్ని కాపాడుతోందని పేర్కొన్నారు. దేశానికి జవాన్‌తో పాటు రైతు కూడా వెన్నెముక అని తెలిపారు. రైతులు లేకుండా జీవనం ముందుకు సాగడం చాలా కష్టమన్నారు. అధిక దిగుబడుల కోసం సేంద్రీయేతర ఎరువులను వినియోగించడంతోనే పంటలకు పురుగులు పట్టి ఆరోగ్యం దెబ్బతినే దయనీయ పరిస్థితులు దేశంలో నెలకొన్నాయని వివరించారు.

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం ఆవు పేడ, మూత్రాన్ని అక్కడి మహిళా సంఘాల ద్వారా నిర్ణయించిన ధరను బట్టి సేకరించి వర్మీ కంపోస్టు కోసం రైతులకు సబ్సిడీపై విక్రయిస్తుందని తెలిపారు. దీంతో రైతులు ఎక్కువగా సేంద్రియ ఎరువుతోనే వ్యవసాయం కొనసాగించి అధిక దిగుబడులు సాధిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సక్రియానాయక్, నాగరాజు, రాజవర్దన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, హైదరాబాద్ రాజయోగ బ్రహ్మకుమారి అరుంధతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల కష్టాలు

» ఉదయం నుంచి సింగిల్ విండో వద్ద ఎదురుచూపులు

» పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ



గోపాల్‌పేటలో టోకెన్‌చూపుతూ పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న రైతులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు సోమవారం ఉదయం నుంచి పడిగాపులు కాశారు. క్యూలో ఉన్న రైతులను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు పడరాని పాట్లు పడ్డారు. 450 యూరియా బస్తాలు రాగా, ఒక్కో రైతుకు కేవలం రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని వ్యవసా య సహకార సంఘం కార్యాలయం వద్ద 10 గంటల తర్వాత అధికారులు వచ్చి యూరియా రాలేదని చెప్పడంతో ఆగ్రహంతో రైతులు వాగ్వాదానికి దిగారు. ప్రధాన రోడ్డుపై ధర్నా నిర్వహిం చారు. ఎస్ఐ నరేష్ కుమార్ వచ్చి రైతులతో మాట్లాడారు. టోకెన్లు రానీ తిప్పించుకుంటున్నారని వాగ్వాదానికి దిగారు. ఎస్ఐ, ఏఓ కరుణశ్రీ మంగళవారం యూరియా వస్తుందని హామీ ఇవ్వడంతో శాంతించారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలోని హాకా కేంద్రం వద్ద రైతులు తెలవారు జాము నుంచి బారులు తీరారు. 500 మందికి పైగా రైతులు రాగా 150 మందికి రెండు బస్తాల చొప్పున ఇచ్చారు.

మరికల్: మండల కేంద్రంలో టోకెన్ల కోసం రైతువేదిక వద్ద క్యూలో వాటర్ బాటిళ్లు, రాళ్లు పెట్టారు. ఆగ్రో రైతు సేవా కేంద్రం వద్ద గంటల తరబడి క్యూలో నిలబడ్డారు.



మరికల్‌లో రాళ్లు, బాటిళ్లను క్యూలో పెట్టిన రైతులు

మంద సురేఖకు అవార్డు ప్రదానం

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సాహితీ, సామాజిక-ఆధ్యాత్మిక సాంస్కృతిక కళాసేవారంగాల్లో పరిశోధనలు, సేవలు అందిస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మంద సురేఖకు దాసరి నారాయణరావు స్మారక ప్రతిభా, సినిమా అవార్డులు-2025 సందర్భంగా సోమవారం ఘనంగా అవార్డుతో సన్మానించారు. గోసంరక్షణ, ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం సాధ్యమనే అంశంపైనే ఈ అవార్డుకు ఎంపికయ్యారు. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆలూరి విల్సన్, ప్రముఖుల చేతుల మీదుగా హైదరాబాద్‌లో అవార్డును అందుకున్నట్లు ఆమె తెలిపారు.

కొనసాగుతున్న నీటి విడుదల

దేవరకద్ర, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భారీ నీటి పారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్‌కు వరద ఉధృతి పెరిగింది. దీంతో సోమవారం ప్రాజెక్టు ఆరు షెట్టర్లు తెరిచి నీటిని దిగువకు విడుదల చేశారు. పూర్తి సామర్థ్యం 32.5 అడుగులు కాగా సాయంత్రం నాటికి 32.2 అడుగుల కు చేరింది. రెండు రోజుల నుంచి వర్షాలు కురవడంతో అంకిళ్ల, కోయిల్‌కొండ, మద్దూర్ పెద్దవాగుల నుంచి ప్రాజెక్టుకు నీరు చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 12వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు.



దిగువకు వెళ్తున్న నీరు

కుండపోత వర్షానికి జలమయం

» పొంగిన వాగులు, పలు గ్రామాలకు రాకపోకలు బంద్

» దుందుభీ నదికి పెరిగిన వరద



కోస్గిలో ఉధృతంగా ప్రవహిస్తున్న ముశ్రీఫా వాగు

తాడూరు/ కోస్గి/ రాజోలి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తాడూరు మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీని కారణంగా మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులతోపాటు నాగర్‌కర్నూల్ జడ్చర్ల ప్రధాన రహదారిపై ఉన్న కాజ్‌వేపై నుంచి వరద ఎక్కి పారింది. గుట్టలపల్లి సమీపంలో ఉన్న కాజ్‌వేపై నుంచి, అంతారం సమీపంలో ఉన్న లోలెవల్ కాజ్‌వేపై నుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో కొంత సమయం రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువన కురిసిన వర్షం కారణంగా దుందుభి నది ప్రవాహం పెరిగింది.

ఉధృతంగా ప్రవహించిన ముశ్రీఫా వాగు

కోస్గి మండలంలో కొత్తపల్లి, ముంగిమళ్ల ముశ్రీఫా, బిజ్జారం వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముశ్రీఫా వద్ద తాత్కాలికంగా ఏర్పాటుచేసిన వంతెన మునిగిపోయింది. 2010 తరువాత పెద్ద ఎత్తున ఇప్పుడే వరద వచ్చిందని గ్రామస్థులు తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలోని శాసంకాలనీ, బృందావన్‌కాలనీ, పద్మావతికాలనీలలో లోతట్టు ప్రాంతాలలో వర్షపునీరు చేరింది. 51మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

రాజోలి పునరావాస కాలనీల్లో అస్తవ్యస్తం

ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా మండల కేంద్రంలోని పునరావాస కాలనీలు అస్తవ్యస్తంగా మారాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక వర్షం నీరు ఇళ్ల చుట్టూ నిలిచి ప్రజలకు ఇబ్బందిగా మారింది. చేనేత కార్మికులు ఇంట్లో ఏర్పాటు చేసుకున్న మగ్గం గుంతల్లో వర్షం ఊట నీరు చేరింది. కాలనీలను బీజేపీ నాయకులు సోమవారం పరిశీలించారు.

రిజర్వేషన్లపై ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి..)

రిజర్వేషన్లు ఉండగా.. అలా అయితే మార్పులు, చేర్పులకు అవకాశం పెద్దగా ఉండదు. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలంటే కులగణన నివేదిక ఆధారం చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. గత రిజర్వేషన్లు, 2011 జనాభా, స్త్రీ, పురుష నిష్పత్తి వివరాలను ప్రభుత్వం కలెక్టర్ల నుంచి కోరింది. ప్రభుత్వం వద్ద ఉన్న కులగణన నివేదికను, పాత వివరాలను సరిచూసుకుని.. రిజర్వేషన్ల కేటాయింపునకు జీఓ జారీ చేస్తారు. మొత్తం స్థానాల్లో 50 శాతం మహిళలకు కేటాయించాల్సి ఉండటంతో జానాభా నిష్పత్తిని ఆధారంగా చేసుకోనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు మాత్రం 2011 జనాభా లెక్కల ఆధారంగానే రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. ముందుగా గ్రామాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం గ్రామాన్ని ఏ కేటగిరీకి కేటాయించాలో నిర్ణయిస్తారు. సదరు కేటగిరీకి కేటాయించిన తర్వాత వాటిల్లో 50 శాతం మహిళలకు కేటాయిస్తారు. మహిళకు కేటాయించడం అనేది లాటరీ పద్ధతిలో ఉంటుందని ప్రస్తుత అంచనాలు ఉన్నాయి. అయితే కేవలం ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే లాటరీ పద్ధతిలో కేటాయిస్తారని, మిగతా వారికి జనాభా ప్రకారం కేటాయిస్తారనే అభిప్రాయం కూడా వస్తోంది. ప్రభుత్వం కలెక్టర్ల నుంచి అందిన నివేదిక తర్వాత జీఓ ఎలా విడుదల చేస్తుందో వేచిచూడాల్సి ఉంది.

ఆందోళనలో స్థానిక నేతలు..

గ్రామాల్లో ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టడంతో తమ గ్రామం ఎవరికి రిజర్వేషన్ అవుతుందోనని చర్చించుకుంటున్నారు. ఒకవేళ రిజర్వేషన్ల కేటాయింపు తర్వాత అందరికీ కలిపి లాటరీలో మహిళలకు కేటాయింపులు చేస్తే మాత్రం చాలామంది నాయకులు తమ సతీమణులు లేదా కుటుంబ సభ్యుల్లో ఒకరిని బరిలోకి దింపే అవకాశం ఉంది. దాదాపు పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. స్థానిక నాయకులు పోటీకి ఉవ్విళ్లూరుతున్న సమయంలో లాటరీ పద్ధతి కేటాయింపు వారికి ప్రతిబంధంకంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. గతంలో ఈ విధానంలో ఎప్పుడూ కేటాయింపులు చేయకపోవడంతో ఈసారే ఎందుకు పాత విధానాన్ని అవలంభించాలనే అభిప్రాయం వస్తోంది. స్త్రీ, పురుష నిష్పత్తిలో ఏ గ్రామంలో ఎక్కువగా ఉంటే మండలం యూనిట్‌గా 50 శాతం రిజర్వేషన్లు వచ్చేలా చూడాలనే అభిప్రాయం ఉంది. అయితే రొటేషన్ ప్రకారం చేయాలనే డిమాండ్ కూడా బలంగా ఉంది. అలా అయితే గతంలో మహిళలకు రిజర్వేషన్ ఉన్న గ్రామంలో ఈసారి జనరల్, జనరల్ ఉన్న స్థానంలో మహిళకు రిజర్వేషన్ వచ్చి సమన్యాయం జరుగుతుందనే అభిప్రాయం వస్తోంది. ఒకవేళ లాటరీ పద్ధతి అయితే మాత్రం ఇబ్బందులు పడతామని స్థానిక నాయకులు చెబుతున్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

» సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్



మాట్లాడుతున్న సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్

అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎన్నికల ముందు నల్లమల పాదయాత్రలో ప్రకటించినట్లుగా పాత పెన్షన్‌ను అమలు చేయాలని సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బీరం అమరేందర్‌రెడ్డి అధ్యక్షతన డివిజన్ స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించినటువంటి హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్‌సింగ్ అమలు చేసిన విధంగా అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటి, ఫ్యామిలీ పెన్షన్‌లను సాధించుకున్నామన్నారు. సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా పీ.గోపాల్, జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, డివిజన్ గౌరవ అధ్యక్షుడిగా మారేడి కుమార్, అధ్యక్షుడిగా తేజనాయక్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు.

'డీసీసీబీపై అసత్య ప్రచారాలు ఆపండి'



సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్ చైర్మన్లు

పాలమూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : డీసీసీబీపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేయడాన్ని తీవ్రంగ ఖండిస్తున్నామని ఉమ్మడి జిల్లా పీఏసీఎస్ చైర్మన్ల ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు పీ.మధుసూదన్‌రెడ్డి, పీ.సుధాకర్‌గౌడ్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీసీసీబీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐదేళ్ల క్రితం జరిగిన బ్యాంకు కార్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణంపై ఆరోపణలు రాగా, అప్పట్లోనే విచారణ చేసి అవినీతి సొమ్మును రికవరీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగ నిర్మించిన నూతన ప్రహరీని నిబంధనల మేరకే టెండర్లు పిలిచి నిర్మాణం చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అబండాలు వేయటం సరికాదన్నారు. కంప్యూటర్ల కొనుగోలులో జరిగిన కుంభకోణంలో ప్రస్తుత చైర్మన్, బ్యాంకు అధికారులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గతంలో సీఈఓగా పనిచేసిన లక్ష్మయ్య తప్పులు చేసి సస్పెండ్‌కు గురైనా, మరికొందరు చేస్తున్న గోబెల్స్ ప్రచారంతో బ్యాంకుపై ప్రజల్లో అనుమానాలు పెట్టుకోరాదన్నారు. రైతులకు న్యాయం చేయటం కోసం చైర్మన్ ఆధ్వర్యంలో బ్యాంకు సిబ్బంది నిస్వార్థంగ పని చేస్తున్నారని తెలిపారు. పీఏసీఎస్ సొసైటీలకు పెట్రోల్‌బంకులు మంజూరు చేస్తామని, ఏవైనా ఇబ్బందులు వస్తే తానే బాధ్యత వహిస్తానని హామీ ఇచ్చిన గత సీఈఓ లక్ష్మయ్య తొమ్మిది మంది సొసైటీల చైర్మన్ల నుంచి రూ.కోటి వసూలు చేసి ఏజెన్సీకి చెల్లించి మోసం చేశాడన్నారు. ఆయనపై క్రిమినల్ కేసులు పెట్టి సొమ్మును రికవరీ చేయాలని మెజారిటీ పీఏసీఎస్ చైర్మన్లు అభిప్రాయపడ్డారు.

క్రైం కార్నర్

అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి మృతి

కృష్ణ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణ పేట జిల్లా కృష్ణ మండలంలోని గూడెబల్లూరు పంచాయతీ శివారులోని చెక్‌పోస్టు సరిహద్దులో చోటు చేసుకుంది. సోమవారం ఎస్‌ఐ నవీద్ తెలిపిన వివరాల ప్రకారం.. టై రోడ్డు నుంచి కర్ణాటక రాష్ట్రం రాయచూర్ వైపు 167వ జాతీయ రహదారిపై డివైడర్ పక్కన ఒక గుర్తు తెలియని మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన చేరుకుని మృతదేహం, స్థలం పరిశీలన నిర్వహించి మృతి చెందిన వ్యక్తి గుర్తు పట్టలేని విధంగా ఉందని తెలిపారు. వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్ల వరకు ఉండొచ్చని, నల్లని ప్యాంట్, డార్క్ బ్రౌన్ కలర్ ఫుల్ షర్టు, డ్రాయర్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రఘు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ ఇప్పించలేదని యువకుడి ఆత్మహత్య


చరణ్ (ఫైల్)

లింగాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తల్లి సెల్ ఫోన్ ఇప్పించలేదని క్షణికావేశానికి గురై యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన దేవేందర్, లత దంపతుల కుమారుడు చరణ్ (18) వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఇటీవల జరిగిన గణేష్ నిమజ్జనం రోజు పోగొట్టుకున్నాడు. మరో ఫోన్ ఇప్పించాలని తల్లి గీతను కోరాడు. జీతం వచ్చిన వెంటనే ఇప్పిస్తానని చెప్పింది. ఈమె మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో పనిచేస్తుంది. పని నిమిత్తం నాగర్‌కర్నూల్ వెళ్లగా ఇద్దరు అన్నదమ్ములు ఇంట్లోనే ఉన్నారు. ఒక గదిలో తమ్ముడు ఉండగా మరో గదిలో ఉన్న చరణ్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి దేవేందర్ ఇదివరకే మరణించాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు

కొత్తకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఐదుగురికి గాయలైనా ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాల మేరకు.. ఏపీలోని నంద్యాల జిల్లా నందికొంట్కూర్ మండలం దామగట్ల గ్రామానికి చెందిన షేక్ సలామల్లా, ముర్తుజావలి, అజ్మతుల్లా, మౌలాలి, రహీంబాషా, షేక్ రఫీ, షేక్ ఖయ్యాం జీవనోపాధికై వనపర్తికి వచ్చారు. మదనాపురం మండలం గోవిందహళ్లి గ్రామంలో టైల్స్ పనులు ముగించుకొని ఆదివారం అర్ధరాత్రి వనపర్తికి ఆటోలో వెళ్తుండగా గుంపుగట్టు సమీపంలో ఎదురుగా వాహనం వచ్చిన వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రహీంబాషా (24) అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ఐదుగురిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

బస్సు కింద పడి వివాహిత మృతి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. మహబూబ్‌నగర్ రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కొత్తపల్లికి చెందిన కృష్ణవేణి(30), భర్త రాములు, తండ్రితో కలిసి ద్విచక్రవాహనంపై సోమవారం ఊట్కూర్ వెళ్తున్నారు. మహబూబ్‌నగర్ మండలం కోడూరు వద్ద బైక్ హ్యాండిల్‌కు ఎదురుగా వచ్చిన బస్సు తగలడంతో అదుపు తప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో భర్త, తండ్రి కుడివైపు పడిపోగా, కృష్ణవేణి బస్సు టైరు కిందకు వెళ్లడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త రాములు ఇచ్చిన ఫిర్యాదుమేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పందిని తప్పించబోయి..

» ఆటో ఢీకొని ముగ్గురికి గాయాలు

నవాబ్‌పేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న పందిని తప్పించబోయి కిందపడిన వారిపై ఆటో దూసుకుపోవడంతో ముగ్గురు గాయాలపాలైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా వానగుట్ట రైస్‌మిల్లుల సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం నవాబ్‌పేట మండలం యన్మనగండ్ల గ్రామానికి చెందిన బ్యాగరి రవి, ప్రకాష్, మరో బాలిక బైక్‌పై సోమవారం సాయంత్రం 6గంటల సమయంలో నవాబ్‌పేట వైపు బయలుదేరారు. వానగుట్ట సమీపంలో ఎదురుగా పంది రావడంతో దాన్ని తప్పించబోయి కింద పడ్డారు. ఇది గమనించకుండా వేగంగా ఆటో వచ్చి వారిపై నుంచి దూసుకుపోవడంతో ప్రకాశ్‌కు కాలు విరిగింది. రవి, బాలికకు తీవ్ర గాయాలు కావడం స్థానికులు బంధువులకు సమాచారం ఇచ్చి వారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

పెద్దపొర్లలో వీధి కుక్కల స్వైర విహారం

» 8 మంది చిన్నారులు, మహిళపై దాడి


గాయపడిన చిన్నారి శ్రావ్య

ఊట్కూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కనిపించిన వారిని కనిపించినట్లు వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చిన ఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామంలోని దళితవాడలో నివాసం ఉంటున్న చిన్నారి శ్రావ్యపై ముందుగా దాడి చేసిన కుక్కలు, అక్కడే ఉన్న అజయ్, శశికళ, లక్ష్మిపై దాడి చేశాయి. స్థానికులు గమనించి తరిమేశారు. అక్కడి నుంచి బీసీవాడలో ఉన్న హిందుపూర్ కొండమ్మపై దాడి చేశాయి. గుర్వ వీధిలో ఉంటున్న కార్తీక్, రవిలపై దాడి చేసి గాయపర్చాయి. అంతకుముందు వడ్డెగేరిలో ఎద్దు, ఆవు, దళిత వాడలో మరో ఎద్దును గాయపర్చారు. గ్రామం మొత్తం విషయం తెలియడంతో ప్రజలందరూ భయపడిపోయారు. కొందరు కోపంతో దాడి చేసిన కుక్కను వెతికి చంపేశారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

వివాహిత అదృశ్యం

నవాబ్‌పేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెద్దల పండుగకు వచ్చిన వివాహిత అదృశ్యమైనట్లు ఏఎస్‌ఐ జనార్దన్ సోమవారం తెలిపారు. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం వీరాపూర్‌కు చెందిన నవనీత ఈనెల 20న మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం పల్లెగడ్డకు పెద్దల పండుగకు వెళ్తానని భర్త రాఘవేందర్‌కు చెప్పి వచ్చింది. ఆదివారం రాత్రి పెద్దలకు పెట్టిన అనంతరం అందరు భోజనం నిద్రించారు. తండ్రి పాండయ్య అర్ధరాత్రి మెళకువ వచ్చి లేచి కూతురును చూడగా కనిపించలేదు. ఆందోళన చెందిన ఆయన చుట్టుముట్టు వెతికిన కానరాలేదు. దీంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

భర్తతో గొడవపడి భార్య..

భూత్పూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో భర్తతో గొడపడి భర్త వెళ్లిపోయిన ఘటన సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా.. నారాయణపేట జిల్లా, గుండుమాల్ మండల తండాకు చెందిన కావేరి భూత్పూర్ పట్టణానికి చెందిన అడికే నరేశ్‌తో 15ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. మూడు రోజుల క్రితం భార్య, భర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. ఈ నెల 21వ తేదీన ఇంట్లో ఎవరికి చెప్పకుండా కావేరి వెళ్లిపోయింది. విషయాన్ని భర్త అడికే నరేశ్ భార్య తల్లిదండ్రులకు, వారి కుటుంబ సభ్యులకు వివరించాడు. రెండు రోజులుగా ఆమె గురించి వెతికారు. జాడ లభించకపోవడంతో కావేరి తమ్ముడు యోగేంద్రకుమార్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్‌ఐ తెలిపారు.

నిఘా కరువవుతోంది..!

» మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో చోరీలు, కిడ్నాప్‌లు!
» 52 సీసీ కెమెరాలలో 40 పనిచేయని వైనం
» 13 మంది ఎస్‌పీఎఫ్, ఇద్దరు సివిల్ పోలీసుల విధులు
» తలనొప్పిగా మారిన భద్రత



మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అది ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి.. నిత్యం వేల సంఖ్యలో రోగులు, సహాయకుల రాకపోకలు సాగిస్తుంటారు. 650 పడల సామర్థ్యం ఉన్న ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లతోపాటు ప్రతీ రోజు వందల్లో ఓపీలు అవుతుంటాయి. వందల్లో వాహనాలను అక్కడ నిలుపుతుంటారు. ఇంత ప్రాధాన్యం ఉన్న ఆసుపత్రిలో నిత్యం వాహనాల చోరీలు, రోగులు, వారి సహాయకులకు సంబంధించిన పర్సులు పోవడం, సెల్‌ఫోన్‌లను తస్కరించడం, చివరకు మృతదేహాలపై నగలు దోచుకోవడం వంటి ఘటనలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. ఇక వాహనాల చోరీలకు అడ్డేలేదు. బైక్‌లు, ఆటోలు మాయమవుతుంటాయి. పుట్టిన శిశువును అపహరిస్తేనే ఏడాదిగా ఆచూకీ లేదు. ఇంత జరుగుతున్నా అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయరు.. చేసినా కేబుళ్లను కత్తిరిస్తున్నారు. ఈ వ్యవహారాలపై స్థానిక పోలీసులకు నిత్యం తలనొప్పిగా మారుతోంది.

సంబంధం లేనట్లుగానే..

జనరల్ ఆసుపత్రిలో పోలీస్ అవుట్‌పోస్టులో ఇద్దరు సివిల్ పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. 13 మంది ఎస్‌పీఎఫ్(రాష్ట్ర భద్రతా బలగాలు) విధులు నిర్వర్తిస్తుండగా, ప్రైవేట్ సైన్యం పదుల సంఖ్యలో విధులు నిర్వర్తిస్తోంది. ఇంత మంది ఉన్నా అక్కడ చోరీలు సులువుగా జరిగిపోతుంటాయి. ఎస్‌పీఎఫ్ బలగాలలో ఏఎస్‌ఐ, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లతోపాటు పది మంది కానిస్టేబుళ్లు రెండు షిఫ్టులలో విధులు నిర్వర్తిస్తున్నారు. అయినా అక్కడ పెట్రోలింగ్, తనిఖీలు చేసే పని తమది కాదని, కేవలం ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించడమే తమ విధి అని చెబుతున్నారు. మరి అక్కడ ప్రతీ రోజు వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించేందుకు ఆ స్థాయిలో ఫోర్సును ఎందుకు నియమించాల్సి వస్తుందో తెలియదు. పోలీసు అధికారులు కూడా ఎస్‌పీఎఫ్ బలగాల విధులు పరిమితమేనని, చోరీలు, కిడ్నాప్‌లు నియంత్రించాల్సిన పని వారిది కాదని, వారి ముందు ఏదైనా జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నట్లుగా చెబుతున్నారు. అలాంటపుడు సివిల్ పోలీసులనే అదనంగా ఎందుకు నియమించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పోలీస్ అవుట్‌పోస్టులో ఇద్దరు పోలీసులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఎస్‌పీఎఫ్ పరిమితి తక్కువ అనుకుంటే పోలీస్ ఉన్నతాధికారులు అవుట్‌పోస్టను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. రెండుషిఫ్టలలో 8 మందిని నియమించి నిత్యం ఆసుపత్రి వార్డులు, పార్కింగ్ ప్రాంతాలలో పెట్రోలింగ్ చేస్తే సీసీకెమెరాల పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలిస్తు అవుట్‌పోస్టలో కమాండింగ్ కంట్రోల్ పెడితే చాలా వరకు అసాంఘిక చర్యలు తగ్గే అవకాశం ఉంటుంది.

సీసీ కెమెరాల పరిస్థితి దయనీయం

సీసీ కెమెరాల పనితీరు చర్చనీయాంశంగా మారింది. అక్కడ 64 కెమెరాలు అవసరం ఉండగా ఇదివరకు 52 చోట్ల ఏర్పాటు చేశారు. జనరల్ ఆసుపత్రి నుంచి 40, ఎన్‌ఎంసీ ఆధ్వర్యంలో 12 కెమెరాలు ఏర్పాటుచేయగా, ఇందులో ఆసుపత్రి నుంచి ఏర్పాటు చేసిన 40 కెమెరాలు పని చేయడం లేదు. వీటి మరమ్మతుకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందని, అందుకే ఏర్పాటుచేయడం లేదని అధికారులు చెబుతున్నారు. కాగా ఇటీవల రూ.లక్షన్నర ఖర్చుచేసి అధికారి ఛాంబర్‌ను ఆధునీకరించడం గమనార్హం. పోలీసులు ఆసుపత్రిని పరిశీలించినప్పుడు చాలా సందర్భాల్లో కెమెరాల కేబుల్ కట్ అయినట్లు పరిశీలించారు. అక్కడ పనిచేసే సిబ్బంది నిర్లక్ష్యం, సీసీకెమెరాలు పనిచేయకపోవడంపై ఇదివరకే పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులకు నివేదికలు అందించినా మార్పు రావడం లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల సామాజిక మాధ్యమాలలో ఆసుపత్రిలో భద్రత కరువైందని వస్తున్న వార్తలతో ఎస్‌పీఎఫ్ ఉన్నతాధికారులతోపాటు న్యాయాధికారులు వరుసగా ఆసుపత్రిలో విచారణ చేస్తున్నారు. రెండ్రోజుల క్రితం ఎస్‌పీఎఫ్ అధికారులు విచారణ చేసి, పోలీస్ ఉన్నతాధికాయులతో చర్చించారు. సోమవారం న్యాయాధికారి సైతం మూడు గంటలపాటు సుదీర్ఘంగా విచారణ చేశారు. పలు విభాగాలను సందర్శించి వైద్యాధికారులతో సమావేశమయ్యారు. అయితే ఈ వ్యవహారాలపై పోలీస్ అధికారులు, ఆసుపత్రి వర్గాలు స్పందించడానికి నిరాకరిస్తున్నారు.

కలెక్టరేట్ ఎదుట రైతుల ఆత్మహత్యాయత్నం

» ప్రజావాణికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
» పురుగుల మందు తాగుతుండగా లాక్కున్న పోలీసులు


లాక్కొన్న పురుగుమందు డబ్బాతో కానిస్టేబుల్..


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

గద్వాల క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం కలెక్టరేట్ వద్దకు వెళ్లగా పోలీసులు అడ్డుకోవడంతో విసుగు చెందిన రైతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి రైతులు అంజనేయులు, నర్సింహులు, చిన్న నర్సింహులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణ శివారులోని తమకు సంబంధించిన భూమిలో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ భూమికి సంబందించిన గొడవ రెవెన్యూ కలెక్టర్ వద్ద 2025 నుంచి భూ వివాదపు కేసు జరుగుతుందన్నారు. కేసు నడుస్తున్నప్పటికి అవతలి వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతుండటంతో గతంలోనే ఫిర్యాదు చేయడంతో అక్రమ నిర్మాణాలు ఆపాలని రెవెన్యూ కలెక్టర్ కూడా ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ భూమికి సంబంధించి పాస్‌బుక్కులు కూడా ఇవ్వాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. కానీ పాసుబుక్కులు ఇవ్వడంలో రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారని, దీంతో పాటు తాము ఫిర్యాదు చేసిన భూమిలోనే ఇతరులు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ విషయంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు కలెక్టర్ కార్యాలయంలోని వెళ్లకుండా అడ్డుకోవడంతో రైతులు పోలీస్‌లతో వాగ్వాదానికి దిగారు. ప్రధాన గేటు వద్ద అడ్డుపడటం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న వారు లోపలికి పంపాలని చెబుతున్నా పోలీసులు వినకపోవడంతో తమ వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగేందుకు యత్నించారు. అక్కడే ఉన్న పోలీసులు డబ్బాను లాక్కొని ఉన్నతాధికారులు సమాచారం ఇచ్చారు. దీంతో వారిని లోపలికి పంపాలని ఆదేశించడంతో పంపించారు. కార్యాలయంలో ఏఓ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందించి వెళ్లిపోయారు.

పింఛన్లపై మాట తప్పిన సీఎం రేవంత్

» కొత్త పింఛన్లు మంజూరయ్యే దాకా పోరాడుతా
» ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి రాడు.. బయట తిరగడు
» ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

కొల్లాపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తనకు రాష్ట్రంలో ఉన్న పేద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల కష్టాలు తెలుసని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సభ పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకుడు ధనోజు కిరణ్‌చారి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరై పట్టణంలోని బాబుజగ్జీవన్ రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ డబ్బులు పెంచే వరకు న్యాయం కోసం పోరాటం చేస్తామన్నారు. మాట తప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిలదీస్తానని, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా, బయట తిరగకుండా నిద్రపోతున్నాడని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పింఛన్లు పెంచుతాడో తన పదవికి రాజీనామా చేస్తాడో తేల్చే వరకు ఉద్యమిస్తామన్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల ముందు పింఛన్ డబ్బులను పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోనందుకే తాను ఉద్యమం ప్రారంభించానని వెల్లడించారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శించుకుంటూ కాలయాపన చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి తాను 800 ఎకరాల భూములున్న కుటుంబంలో పుట్టానని చెప్పిన ఆడియోను సన్నాహక సభలో అందరికీ వినిపించారు. అలాగే వందల ఎకరాల భూములు ఉన్న కుటుంబంలో కేసీఆర్ పుట్టారని, ఆయన కుమారుడు కేటీఆర్ మాట్లాడిన ఆడియోను అందరికీ మందకృష్ణ వినిపించారు. వీరిద్దరూ పేదల కష్టాలు ఎరిగిన వారు కారని ఆయన విమర్శించారు. వచ్చే నెల 6వ తేదీ నుంచి నవంబర్ 6వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని ఆయన పింఛన్ దారులకు పిలుపునిచ్చారు. నవంబర్ 26వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభ ద్వారా రేవంత్‌రెడ్డితో తాడోపేడో తేల్చుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాటం జంబులయ్య, రాముడు, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్ బాబు, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని పీజీ, అనుబంధంగా ఉన్న కళాశాల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రి (ఐదు సంవత్సరాల కెమిస్ట్రీ కోర్సు) ఆరో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను సోమవారం వీసీ ఛాంబర్‌లో వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, అధికారులతో కలిసి విడుదల చేశారు. విద్యార్థులకు పరీక్షలు, మార్కులే కాకుండా పరిశోధనల పై ఆసక్తి పెంచి కొత్త ఆవిష్కరణలు చేసేలా తీర్చిదిద్దాలని అధ్యాప కులకు వీసీ సూచించారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి ప్రవీణ, చంద్రకిరణ్, అనురాధ, గౌతమ్‌రాజ్ తదితులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడు

» యువకుడికి దేహశుద్ధి చేసిన బాలిక తండ్రి

జడ్చర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బాలికతో ఓ యువకుడు అసభ్యంగా ప్రవర్తించగా, ఆగ్రహించిన తండ్రి సదరు యువకుడికి దేహశుద్ది చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ప ట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక హోటల్‌లో పని చేస్తున్న యువకుడు బాలికతో అసభ్యంగా ప్రవరిస్తూ, గోడపై ఫోన్ నెంబరును రాశాడు. దీంతో భయాందోళనకు గురైన బాలిక విషయం తండ్రికి చెప్పింది. యువకుడు హోటల్‌లో ఉన్నట్లుగా తెలుసుకుని, వెళ్లి ప్రశ్నించి దేహశుద్ధి చేశాడు. దీంతో యువకుడు జరిగిన దాడిని సోదరుడితో పాటు స్నేహితులకు సమాచారాన్ని చేరవేశాడు. యువకుడి గ్యాంగ్ అంతా కలిసి బాలిక తండ్రిపై ఇష్టానుసారంగా చితకబాదారు. అడ్డుకోబోయిన మరో యువకుడిని సైతం కొట్టారు. ఈ ఘటనపై ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇరువర్గాలపై హత్యాయ త్నం కేసు నమోదు చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

శక్తి పీఠాన్ని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం

» నటి ప్రత్యూష


శక్తి పీఠంలో హోమం నిర్వహిస్తున్న నటి ప్రత్యూష

నారాయణపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సంత్ మఠ మూల మహా సంస్థానం, శక్తిపీఠంలో సోమవా రం శ్రీదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. మొదటి రోజు శక్తి పీఠం అమ్మ వారు బాలా త్రిపురా సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రముఖ తెలుగు సీరియల్ నటి ప్రత్యూష శక్తిపీఠాన్ని దర్శించుకుని బ్రహ్మోత్సవాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి హోమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ... శక్తి పీఠాన్ని దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని అన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఉట్కూరు విభావసు పురోహిత్, దోమ సుధాకర్, నంది రాజశేఖర్ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్సలో రాణించాలి

» ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి
» ఉమ్మడి జిల్లా ఉషూ జట్ల ఎంపికలు


ఎంపికైన క్రీడాకారులతో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డా. శారదాబాయి తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మార్షల్ ఆర్ట్సలో విద్యార్థులు రాణించాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ శారదాబాయి అన్నారు. రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17, 19 ఉషూ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను సోమవారం స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో జిల్లా క్రీడాకారులు రాణించాలన్నారు. రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటి పతకాలు సాధించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు కనకంయాదవ్, జహంగీర్‌పాష ఖాద్రీ, సందీప్, పీఈటీ అఫ్రోజ్ పాల్గొన్నారు.

ఎంపికైన జట్ల వివరాలు

బాలురు విభాగంలో హరిచంద్రప్రసాద్ (మహబూబ్‌నగర్), తులసీరామ్, ఆంజనేయులు, జగన్ (నాగర్‌కర్నూల్). బాలికల విభాగంలో పల్లవి, కల్యాణి (మహబూబ్‌నగర్).

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక


:రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన నర్వ కేజీబీవీ విద్యార్థులు

నర్వ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సబ్ జూనియర్ కబడ్డీ పోటీలలో నారాయణపేట్ జిల్లా జట్టుకు నర్వ కేజీబీవీకి చెందిన నలుగురు విద్యార్థినులు అండర్-16 విభాగంలో ఎంపికైనట్లు పీఈటీ త్రివేణి తెలిపారు. సోమవారం మరికల్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన జిల్లాస్థాయి ఎంపికలలో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో పాల్గొని జిల్లా జట్టులో చోటు దక్కించుకున్నారు. సుకన్య, లత కుమారి, మౌనిక, భారతి ఈనెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయికి చేరుకోవడం చాలా గర్వంగా ఉందని పీఈటీ త్రివేణి తెలిపారు.

ముగిసిన సెపక్ తక్రా క్రీడా పోటీలు

వనపర్తి విద్యావిభాగం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఈనెల 21న ప్రారంభమైన 11వ ఇంటర్ డిస్ట్రిక్ట్ సేపక్ తక్రా క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. రెండు రోజుల పాటు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి పురుషుల వి భాగం నుంచి పది జట్లు, మహిళల విభాగం నుంచి పది జట్లు పాల్గొన్నట్లు సేపక్ తక్రా క్రీడా పోటీల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బండారు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పురుషుల విభాగంలో హైదరాబాద్ జట్టు రన్నర్‌గా నిలువగా, విన్న ర్‌గా ఆదిలాబాద్ క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచారు. మహిళల విభా గంలో రన్నర్‌గా నిజామా బాద్ మొదటి స్థానం సాధించగా, విన్నర్‌గా హైద రాబాద్ జట్టు నిలిచింది. గెలు పొందిన జట్లకు ప్రథమ, ద్వితీయ బహు మతులను వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర రావు, సీఐ కృష్ణ ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా యూత్ స్పోర్ట్స్ అధికారి సుధీర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, భాస్క ర్‌గౌడ్, జగన్, రామ్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నారాయ ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


వనపర్తిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఆర్య వైశ్యులు


అమరచింతలో బాలాత్రిపుర సుందరిగా..


కొత్తకోటలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి


పాన్‌గల్‌లో బాలాత్రిపుర సుందరి దేవిగా..


వీపనగండ్ల మండలం కల్వరాలలో..

వనపర్తి రాజీవ్ చౌరస్తా, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేవీ నవరాత్రి ఉత్సవాలను సోమవారం తొలిరోజు జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్యులు అమ్మవారిని గౌరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బచ్చురాము, వెంటకేశ్, వసంత, దేవరాజు, శ్రీనివాసులు, అనంతలక్ష్మి, మంజుల పాల్గొన్నారు.

రేవల్లి : మండలంలోని తలుపునూరులో వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద వీర శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఉత్సవాలు ప్రారంభించారు.

వీపనగండ్ల : మండల కేంద్రంతో పాటు కల్వరాల గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన మండపంలో దుర్గమాత విగ్రహాన్ని అంగరంగ వైభవంగా ప్రతిష్టించారు.

కొత్తకోట : మండలంలో దేవీ ఆలయాల్లో సోమవారం పూజలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని భవానీ శంకర, భక్త మార్కండేయస్వామి, కన్యకా పరమమేశ్వరి, కానాయపల్లి గ్రామ కోటి లింగేశ్వరస్వామి ఆలయాల్లోని అంబా భవానీ, పార్వతి, వానవి మాత, జ్ఞానాంబికాదేవీ బాల త్రిపుర సుందరి దేవీగా దర్శనం ఇచ్చారు. రాజ్యసభ మాజీ సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి భవానీ శంకర ఆలయంలో దేవీని దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పామాపురం, కనిమెట్ట, కొత్తకోట పాత పట్టణం, దండుగడ్డ కాలనీల్లో దేవీ మండపాలను నెలకొల్పి పూజలు చేశారు.

పెబ్బేరు, : మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

పాన్‌గల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో బాల త్రిపుర సుందరి దేవి అవతారంతో భక్తులకు దర్శనమిచ్చారు.

ఆత్మకూర : శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బాలా త్రిపుర సుందరిగా అవతారం ఇచ్చిన అమ్మ వారికి ఆయా గ్రామాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని బాల బ్రహ్మేశ్వర స్వామి ఆంజనేయ స్వామి, కేశవ స్వామి, విశ్వ విరాట్ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అమ్మ వారిని ఏర్పాటు చేసి ఘనంగా హోమాలు నిర్వహించారు. 11 రోజుల పాటు నిర్వహించే అమ్మ వారికి ప్రతీ ఒక్కరు పాల్గొని పూజలు నిర్వహిస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అమరచింత : దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మొదటి రోజు బాల త్రిపుర సుందరి దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మండల కేంద్రంలోని శ్రీకృష్ణ నగర్‌లో వెలిసిన కాళికాదేవి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో మొదటి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు దుర్గామాత బాలా త్రిపుర సుందరి దుర్గాదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్త కొట్టం నాగేశ్వర్‌రెడ్డి ఆలయ అధ్యక్షుడు క్యామ రాములు, తాటికొండ రమేష్, మేర్వరాజు, వెంకట కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తకోటలో బాలాత్రిపుర సుందరి దేవిగా..


ఆత్మకూరు మండలం ఆరేపల్లి గ్రామంలో...


పెబ్బేరులో అమ్మవారికి వస్త్రాలు, ఒడిబియ్యం అందజేస్తున్న భక్తులు


రేవల్లి మండలం తలుపునూరు గ్రామంలో..

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యేల పరామర్శ

కొత్తకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలెం, నాంచారమ్మపేట తండా, నాటవెల్లి పెద్దతండాల్లో బాధిత కుటుంబాలను దేవరకద్ర మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. పాలెం గ్రామ కొండయ్య, నాంచారమ్మపేట తండా హనుమంతు నాయక్, నాటవెల్లి పెద్దతండా మెగ్యా నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెంకటేశ్వర్‌రెడ్డి మృతుల ఇళ్లకు వెళ్లి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు విశ్వేశ్వర్, వామన్‌గౌడ్, బాలమన్నెమ్మ, చెన్నకేశవరెడ్డి, అయ్యన్న, అలీం, ప్రశాంత్, శ్రీనువాసులు, పరమేష్, భాస్కర్, వికాస్ తదితరులు ఉన్నారు.

అటవీ భూముల పరిశీలన


అటవీ భూములను పరిశీలిస్తున్న సిబ్బంది

పాన్‌గల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టాపూర్ తండా సమీపంలోని సర్వే నెంబర్ 34, 40లోని అటవీ భూములను సోమవారం ఫారెస్ట్ రేంజర్ అధికారి బాలకిష్టమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ సర్వే నెంబర్‌లోని భూములు వివాదాస్పదంగా మారాయి ఆ భూముల్లో గతంలో గిరిజన రైతులు చెట్లను ధ్వంసం చేసి విత్తనాలు వేశారని అన్నారు. ఆగస్టు 5వ తేదీన స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. వివాదాస్పదమైన భూములకు వెళ్లవద్దని గిరిజన రైతులకు చెప్పిన ఇటీవల రాత్రి సమయంలో భూముల్లోకి ప్రవేశించి విత్తనాలు వేశారు. ఈ విషయంపై పూర్తి నివేదికను జిల్లా అధికారులకు మరోమారు స్టేషన్లో వారి పై ఫిర్యాదు చేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఆట వస్తువుల పంపిణీ

ఆత్మకూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మునిసిపాలిటీ కేంద్రంలోని 3వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆట వస్తువులు అందజేసినట్లు మండల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రహమతుల్లా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుర్నె రవికాంత్ జన్మదినం సందర్భంగా పంపిణీ చేసినట్లు తెలిపారు.


ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థులకు సత్కారం

కొత్తకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పామాపురం గ్రామానికి చెందిన అల్లిపీరు కుమారుడు ఖాజాపాష ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఆ గ్రామ యువకులు శాలువాతో సోమవారం సత్కరించారు. భవిష్యత్‌ల డాక్టర్‌గా ప్రజలకు వైద్య సేవలు అందించి గ్రామానికి గొప్ప పేరుప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. సత్కారం చేసిన వారిలో రాజమౌళి, బీమపల్లి నాయుడు, ఈశ్వరయ్య సాగర్, జనార్దన్ ఉన్నారు.

వీపనగండ్ల విద్యార్థికి...

వీపనగండ్ల : మండల కేంద్రానికి చెందిన అఖిల నీట్ పరీక్షలో 402 మార్కులు సాధించి వనపర్తి మెడికల్ కళాశాలలో ఎంబీబీస్ సీటు సాధించారు. సోమవారం సీపీఎం నాయకులు అఖిలను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుకొని ఎంబీబీఎస్ సీటు సాధించడం గర్వకారణమని మండల కార్యదర్శి బాల్‌రెడ్డి అన్నారు. వెంకటేష్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, బాలస్వామి, తిరుపతయ్య, నవీన్, వెంకన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

కరాటేలో వైష్ణవికి బంగారు పతకం



పెద్దమందడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామానికి చెందిన పుట్టామోని వైష్ణవి అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించింది. కరాటే మాస్టర్ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం ముంబై అందేరి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన 5వ ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో జపాన్, మలేసియా, నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ దేశాలు పాల్గొన్నాయని తెలిపారు. అమ్మపల్లి గ్రామానికి చెందిన టైలర్ బాలరాజు లక్ష్మి దంపతుల కుమార్తె వైష్ణవి హైదరాబాద్‌లోని గ్రీన్‌వుడ్ టెక్నో స్కూల్ ఉప్పల్‌లో 8వ తరగతి చదువుతూ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచినందుకు ఐకాన్, షోటోఖాన్ కరాటే నిర్వాహకులు, పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థులు పలువురు అభినందించారు.

రోగులకు ఆప్యాయంగా సేవలు అందించాలి


డాక్టర్‌తో వివరాలు తెలుసుకుంటున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

గోపాల్‌పేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రిలో చేరిన రోగులపై ఆప్యాయంగా సేవలు అందిచాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చాకల్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తండ్రి రామ్ రెడ్డి అనారోగ్యంతో వనపర్తిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి రామ్‌రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, ఆశోక్, జోహెబ్, హుసేన్, చంద్రశేఖర్, గన్నోజు, మోహన్, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని జాతీయ రహదారుల విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్డుకు అవసరమైన భూ సేకరణ పనుల విషయమై సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. కార్యక్రమానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఆదర్శ్ సురభి హాజరయ్యారు. జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన భూ సేకరణ, కోసం ఆయా జిల్లాలోని సమస్యలను అడిగి తీసుకున్నారు. భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని, దసరా పండుగ వరకు భూ సేకరణ పనులు పూర్తి చేసి భూమి అప్పగించే విధంగా కలెక్టర్లు, ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి



మండల పరిషత్ అధికారి శ్రీపాదుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు, ఇంటి స్థలాలు వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, జీవన భృతి, పెన్షన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే గ్రామాల్లోని లబ్ధిదారులను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ శ్రీపాదులకు అందజేశారు. లక్ష్మి నారాయణ శెట్టి, మోష, శ్రీహరి, బాలకృష్ణ, లింగన్న, ఖాజాపీర్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వంతోనే సుస్థిర పాలన


సమావేశంలో మాట్లాడుతున్న మంగ లావణ్య

అమరచింత, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతోనే ఈ దేశ ప్రజలకు సుస్థిర పాలన అందుతుందని బీజేపీ అమరచింత మండల అధ్యక్షురాలు మంగ లావణ్య పేర్కొన్నారు. సోమవారం అమరచింతలో విలేకరులతో మాట్లాడారు. దేశంలోని మారుమూల ప్రాంతలలో ఉండే సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన మంత్రి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు జీఎస్టీ కౌన్సిల్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని అన్నారు. జీఎస్టీ 2.0 అమలుతో రైతులు, మహిళలు, విద్యార్థులకు, మధ్యతరగతి, సామాన్య ప్రజలకు గణనీయమైన లాభం పెరుగుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల సంక్షేమం కోసం మరెన్నో పథకాలు తీసుకొచ్చి ఈ దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు వినోద్ కుమార్, మల్లారెడ్డి, భీమ్, సేన్, సాంబారు సత్యానారాయణ, ధర్మాపురం శీను, కృష్ణా నాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం


చెక్కులు అందజేస్తున్న నాయకులు

పెబ్బేరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని బ్లాక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం మునిసిపాలిటీలోని 12వ వార్డులోని లబ్ధిదారులకు అందజేశారు. పేదలు ఎవరైనా కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటే వారికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి ఆర్థిక సాయం అందనుందని పేర్కొన్నారు. వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, రామన్ గౌడ్, రాములు యాదవ్, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణ మేళాను వినియోగించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న యువరాజు


అమరచింత, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వీధి వ్యాపారుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోక కల్యాణ మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేస్మా కోఆర్డినేటర్ యువరాజు పేర్కొన్నారు. సోమవారం అమరచింత మునిసిపల్ కార్యాలయంలో వీధి వ్యాపారుల అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడుతూ.. వీధి వ్యాపారులకు కలుగే లాభాలపై అక్టోబరు 2 వరకు కొనసాగే లోక కల్యాణ మేళా అవగాహన సదస్సులు కొనసాగుతాయని అన్నారు. కార్యక్రమంలో బుక్ కీపర్లు ఖాజా గోపాల్ సంగీత రాజేశ్వరి నాగమణి కమల జ్యోతి శశికళ సాధిక్ పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

అమరచింత, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీగా లేకుండా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మహిళ విభాగం జిల్లా కార్యదర్శి గీతమ్మ మాట్లాడుతూ మునిసిపాలిటీలోని తహసీల్దార్ కార్యాలయం, శ్రీకృష్ణ నగర్ ప్రాంతాల్లోని మరుగుదొడ్లు, అస్తవ్యస్తంగా ఉన్నాయని అన్నారు. పట్టణంలోని తాగునీటి ట్యాంకులను శుభ్రపరచడంతో పాటు సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని బ్లీచింగ్ పౌడర్ దోమల నివారణ మందులను పిచికారీ చేయాలని కోరారు. అనంతరం మునిసిపాలిటీ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రవీందర్, శ్యాంసుందర్, ఏ. భాస్కర్, రఘు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జములమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అమరచింత, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జములమ్మ ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జములమ్మ దేవికి పంచామృతాలతో అభిషేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు పూలమాలలతో అలంకరించారు. భక్తులు ప్రత్యేక అభిషేక పూజలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నరసింహులు, కమల, రవి, క్యామ భాస్కర్, జ్యోతి, బాలరాజు, రవి, సరళ, జగనాదం, శీను తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై శ్రద్ధ అవసరం


చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనివాసులు

గోపాల్‌పేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లలపై తల్లి దండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య అధికారి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్వస్తి నారి సహశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య అధికారి డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రావణి 61 మంది చిన్నపిల్లలను పరీక్షించారు. అందులో 44 మంది చిన్నారులు తక్కువ బరువు, పోషన లోపం ఉండటం వారు గుర్తించారు. జిల్లా వైద్య అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తన పిల్లలపై వారికి ఇచ్చే ఆహారం పై శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. మండల వైద్యులు చాంద్‌పాషా, సిద్ధాగౌడ్, సుచిత్ర, కౌస్యల, మధుబాబు, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఉమా మహేశ్వర్ రావు

వనపర్తి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలనీ డీసీఆర్బీ డీఎస్పీ ఉమామహేశ్వర్ రావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే ప్రతీ ఫిర్యాదును నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత ఎస్ఐలు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుడికి భరోసా కల్పిం చాలని,అయిదు ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్య సేవలు పొందాలి


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రవికిరణ్

కొత్తకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రజలు వైద్య సేవలు పొందాలని స్వస్థ్‌నారి శక్తి పరివార్ అభియాన్ ప్రోగ్రాం అధికారి రవికిరణ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సందర్శించిన రవికిరణ్ ఈ సందర్భంగా చికిత్సలకు వచ్చిన వారితో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సీజనల్ వ్యాధులకు మందులు ఉంటాయన్నారు. వర్షాల సందర్భంగా ప్రజలకు జ్వరాలు రావడం సహజమేనన్నారు. దానికి భయపడి ప్రయివేటులో వైద్యం చేయించుకోవడం దండుగ అన్నారు. టీబీ రోగులను గుర్తించి ప్రత్యేకంగా పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం జిల్లా ఆఫీసర్ సాయినాథ్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ అసియాబేగం, డాక్టర్లు పరిమళ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

శ్రీరంగాపురం సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తాటిపాములలో శనివారం రాముడు ఆకస్మాతుగా మృతిచెందాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అతని భార్య అనారోగ్యంతో బాధపడుతుందని తాటిపాముల ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్య ఈ విషయం ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్ల గా.. తక్షణమే స్పందించిన రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం నుంచి వారికి వచ్చే సదుపాయాలు కల్పించి అన్ని విధాలుగా ఆదుకుంటామంటూ ఎమ్మెల్యే హామీచ్చారని స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి


వేతనాలు చెల్లించాలని కోరుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

వనపర్తి రాజీవ్ చౌరస్తా, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ఇసుక ట్రాక్టర్లకు ప్రభుత్వం ఇస్తున్న కిరాయి సరిపోవట్లేదని మరికొంత పెంచాలని కోరుతూ ఇసుక రీచుల ట్రాక్టర్ల యజమానులు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. పెరిగిన ఖర్చుల రీత్యా 30 కిలో మీటర్ల దూరం వరకు రూ.3,600 పెంచాలని కోరారు. కార్యక్రమంలో రేచింతల, పామాపురం, శాగాపురం, వీరరాఘవపురం, కొత్తూరు, అప్పరాల, తిప్పడంపల్లి, చిలకటోనిపల్లి, తుంకుంట, దుప్పల్లి, కరివేనా, కమాలుద్దీన్‌పూర్ ఇసుక రీచుల ట్రాక్టర్ల యజమానులు పాల్గొన్నారు.

ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు

జిల్లాలోని ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ ఎస్సీ సంక్షేమ హాస్టల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని వారు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రం అందించారు. ఆరు నెలలుగా జీతాలు లేకపోవడంతో తమ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాయన్నారు. దసరా లోపు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు.

- జిల్లా కేంద్రంలో ఖాళీగా ఉన్న ఏదైనా భవనాన్ని ప్రెస్ క్లబ్ కోసం కేటాయించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మాదారి భోజరాజు, జాతీయ మాలల ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ కోరారు. ఈ మేరకు సోమవారం వారు ప్రజావాణిలో అదనపు కలెక్టర్ యాదయ్యకు వినతి పత్రం అందించారు.